సాక్షి విశాఖపట్నం

శుక్రవారం । 17 । ఫిబ్రవరి । 2023



పాలిటెక్నిక్‌తో భవిత

ఉమ్మడి విశాఖ జిల్లాలో 'పాలిసెట్ - 2023'కు గురువారం నుంచి దరఖాస్తుల ప్రక్రియ ప్రారంభమైంది. 8లో



'స్కిల్' ఇన్‌స్టిట్యూట్‌కు అవార్డు

స్కిల్ డెవలప్‌మెంట్ ఇన్‌స్టిట్యూట్‌కు వరుసగా మూడోసారి గ్లోబల్ హెచ్‌ఆర్ స్కిల్ డెవలప్‌మెంట్ అవార్డు లభించింది. 8లో



అబ్బురపరిచిన విన్యాసాలు

సిరిపురంలోని గురజాడ కళాక్షేత్రంలో గురువారం ప్రారంభమైన రాంబో సర్కస్ ఒళ్లు గగుర్పాటుకు గురి చేసింది. 8లో

న్యూస్‌రీల్

న్యాయమూర్తులుగా ముగ్గురు నియామకం



సాహితి, శ్రీవిద్య

విశాఖలీగల్: విశాఖ న్యాయవాదుల సంఘానికి చెందిన ముగ్గురు న్యాయవాదులను నూతన న్యాయమూర్తులుగా హైకోర్టు నియమించింది. ఈ మేరకు రాష్ట్ర హైకోర్టు గురువారం ఉత్తర్వులు జారీ చేసింది. వి.నాగ రంజిత్‌కుమార్‌ను తణుకు జూనియర్ సివిల్ జడ్జిగాను, సిహెచ్ శ్రీవిద్యను శ్రీకాకుళం మొబైల్ కోర్టు జూనియర్ సివిల్ జడ్జిగాను, వాసుపల్లి సాహితిని కాకినాడ ఒకటో అదనపు మెజిస్ట్రేట్‌గా నియమించారు. వీరిని న్యాయవాదుల సంఘం అధ్యక్షుడు వైద్యుల రవీంద్ర ప్రసాద్, బార్ కౌన్సిల్ సభ్యులు, ఇతర న్యాయవాదులు అభినందించారు.

గోడలపై పోస్టర్లు అతికిస్తే చర్యలు

దాబాగార్డెన్స్: నగర సుందరీకరణలో భాగంగా ప్రధాన రహదారులకు ఇరువైపులా గోడలకు ఆకర్షణీయమైన రంగులు వేస్తున్నామని, వాటిపై ఎటువంటి వ్యాపార ప్రకటనలు, పోస్టర్లు అతికించొద్దని మేయర్ గొలగాని హరి వెంకటకుమారి ఒక ప్రకటనలో కోరారు. నగరంలో వచ్చే నెలలో జీ-20 సదస్సును ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తుందని, దీనిలో భాగంగా సుందరీకరణ పనులు చురుగ్గా సాగుతున్నాయని పేర్కొన్నారు. నగరానికి ఎంతో మంది దేశ, విదేశాల నుంచి ప్రతినిధులు రానున్నారని, వారికి ఆహ్లాదకరమైన వాతావరణం కల్పించే బాధ్యత అందరూ తీసుకోవాలన్నారు. గోడలపై పోస్టర్లు అతికిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

పెరిగిన జూ పార్కు ప్రవేశ ధరలు

ఆరిలోవ: ఇందిరా గాంధీ జూ పార్కు ప్రవేశ రుసుం ధరలను ఇటీవల జూ అధికారులు పెంచారు. ఈ నెల 11 నుంచి కొత్త ధరలు అమలు చేస్తున్నారు. కొత్త ధరల ప్రకారం పెద్దలకు రూ 70, పిల్లలకు రూ.30, వీడియో కెమెరాకు రూ.200, స్టిల్ కెమెరాకు రూ.50, కారుకు రూ.750, విదేశీ పెద్దలకు రూ.200, పిల్లలకు రూ.100, లోపల బ్యాటరీ వాహనాలకు పెద్దలకు రూ.70, పిల్లలకు రూ.30 చొప్పున చెల్లించాలి. పాత ధరలు ప్రకారం జూ లోపలకు ప్రవేశించడానికి పెద్దలకు రూ.50, పిల్లలకు రూ.10, వీడియో కెమెరాకు రూ.150, స్టిల్ కెమెరాకు రూ.30, కారుకు రూ.500, లోపల బ్యాటరీ వాహనాలకు పెద్దలకు రూ.50, పిల్లలకు రూ.20 చొప్పున ఉండేవి. మూడేళ్ల తర్వాత ధరలు పెంచారు. దీంతో భారం పెరుగుతుందని సందర్శకులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

డ్రైవింగ్‌లో శిక్షణకు దరఖాస్తుల ఆహ్వానం

కంచరపాలెం: ఉపాధి–శిక్షణ శాఖ ఆధ్వర్యంలో హెవీ వెహికల్ డ్రైవింగ్‌లో 45 రోజుల పాటు శిక్షణ ఇవ్వనున్నట్లు ఐటీఐ ప్రిన్సిపాల్ జి.శ్రీకాంత్ తెలిపారు. కంచరపాలెం పాత పారిశ్రామిక శిక్షణ కేంద్రంలో నిర్వహించే శిక్షణకు 21 ఏళ్లు నిండి, లైట్ వెహికల్ డ్రైవింగ్ లైసెన్స్, హెవీ వెహికల్ ఎల్ఎల్ఆర్ ఉన్న అభ్యర్థులు అర్హులన్నారు. ఫిబ్రవరి 20 నుంచి శిక్షణ తరగతులు ప్రారంభమవుతాయని.. దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు చెప్పారు. మరిన్ని వివరాలకు 98852 13809, 91779 67397లో సంప్రదించాలని సూచించారు.

కొనసాగుతున్న నామినేషన్ల పర్వం

విశాఖలీగల్: విశాఖ న్యాయవాదుల సంఘం వార్షిక ఎన్నికల నామినేషన్ల పర్వం గురువారం కొనసాగింది. కీలకమైన అధ్యక్ష పదవికి చింతపల్లి రాంబాబు, తాళ్లూరి రవికుమార్, పాకా సత్యనారాయణ నామినేషన్లు వేశారు. ఉపాధ్యక్ష పదవికి బి.ఎస్.లత, పీలా మీనాక్షి, కుప్పిలి మురళీధర్, చింతపల్లి ఆనంద కుమార్, కార్యదర్శి పదవికి పైలా శ్రీనివాస్, ఎస్.ఎస్.వాసు, ఎస్.సుధీర్ రెడ్డి నామినేషన్లులు వేశారు. 17 సాయంత్రం 4 గంటలకు నామినేషన్లు పూర్తవుతాయని ఎన్నికల అధికారి జి.ఎం.రెడ్డి తెలిపారు.

నేటి నుంచి రాష్ట్ర స్థాయి ఖోఖో పోటీలు

భీమునిపట్నం: భీమిలిలోని సెయింట్ ఆన్స్ ఎయిడెడ్ ఉన్నత పాఠశాల మైదానంలో ఈ నెల 17 నుంచి 19 వరకు విశాఖ స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో రాష్ట్ర స్థాయి అండర్ 14 బాల, బాలికలకు ఖోఖో పోటీలు జరుగుతాయని ఫెడరేషన్ కార్యదర్శి సీహెచ్.వెంకటరెడ్డి తెలిపారు. అన్ని జిల్లాల నుంచి సుమారు 400 మంది పాల్గొంటారని, వీరికి అవసరమైన సదుపాయాలను కల్పించామని తెలిపారు. ఈ పోటీలను కలెక్టర్ మల్లికార్జున, సీపీ సీహెచ్.శ్రీకాంత్ ప్రారంభిస్తారని వెల్లడించారు.

జీ20 సదస్సుకు తొలి అడుగు

- నగరంలో ప్రారంభమైన గ్లోబల్‌టెక్ సమ్మిట్
- హాజరైన వివిధ దేశాల ప్రతినిధులు
- టెక్నాలజీ, ఫార్మా, వ్యవసాయ రంగాలపై చర్చ
- నేటితో ముగియనున్న సదస్సు



సదస్సుకు హాజరైన దేశ, విదేశీ విద్యార్థులు



సదస్సును ప్రారంభిస్తున్న మంత్రులు విడదల రజిని, పీడిక రాజన్నదొర, గుడివాడ అమర్‌నాథ్, ఎంపీ ఎంవీవీ సత్యనారాయణ, పల్సస్ సీఈవో శ్రీనుబాబు

సాక్షి, విశాఖపట్నం : కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వచ్చే నెల నిర్వహించనున్న ప్రతిష్టాత్మక జీ20 సదస్సుకు తొలి సన్నాహకంగా.. విశాఖ వేదికగా గ్లోబల్ టెక్ సమ్మిట్–2023 గురువారం అట్టహాసంగా ప్రారంభమైంది. ఇప్పటికే పలు ప్రాంతాల్లో నిర్వహిస్తున్న టెక్ సమ్మిట్‌ని ఏపీలో రాష్ట్ర ప్రభుత్వ సహకారంతో పల్సస్ గ్రూప్ నేతృత్వంలో నిర్వహించారు. వీఎంఆర్‌డీఏ చిల్డ్రన్ ఎరీనాలో మంత్రులు విడదల రజిని, గుడివాడ అమర్‌నాథ్, పీడిక రాజన్నదొర, ఎంపీ ఎంవీవీ సత్యనారాయణ, పల్సస్ సీఈవో గేదెల శ్రీనుబాబు సదస్సును ప్రారంభించారు. సాంకేతిక రంగంలో వస్తున్న విప్లవాత్మకమైన మార్పులు, వాటిని అందిపుచ్చుకునేందుకు ఉన్న అవకాశాలు, వనరులపై దేశ, విదేశీ ప్రతినిధులు చర్చించేందుకు వీలుగా ఈ సమ్మిట్ నిర్వహించారు.

భవిష్యత్తులో టెక్నాలజీ రంగంలో చోటుచేసుకోనున్న పరిణామాలను ఏ విధంగా ఆకళింపు చేసుకోవాలి.. ఐటీ పరిశ్రమలతో కలిసి గ్లోబల్ కమ్యూనిటీని రూపొందించుకోవాల్సిన అంశాలపై వివిధ దేశాల ప్రతినిధులు చర్చించారు. వచ్చే నెలలో జరగనున్న జీ20 సదస్సుకు అనుబంధంగా ఈ సమ్మిట్‌ని నిర్వహిస్తున్నారు. ఈ ఏడాది గ్లోబల్ టెక్ సమ్మిట్‌ని రియాద్, సియోల్, టోక్యో, రోమ్, పారిస్, న్యూయార్క్, మెల్‌బోర్న్, బీజింగ్, లండన్, టోక్యో, న్యూఢిల్లీతో సహా జీ20 దేశాల్లో నిర్వహించనున్నారు. దీనికి సంబంధించిన షెడ్యూల్‌ని ఇప్పటికే రూపొందించారు. టెక్ పరిశ్రమలకు ప్రాతినిధ్యం వహిస్తున్న వివిధ దేశాల ప్రతినిధులు తొలిరోజున చర్చించారు. విద్యా విధానంలో టెక్నాలజీ, టెలి కమ్యూనికేషన్ రంగంలో సాంకేతికత ఆధారంగా తీసుకొస్తున్న సంస్కరణలు, భారత్ బిజినెస్ కారిడార్, ఫార్మా రంగంలో టెక్నాలజీ పాత్ర, మేధో సంపత్తి, ఆవిష్కరణల వృద్ధి, బయోఫార్మా రంగంలో డిజిటల్ ట్రాన్స్‌ఫర్మేషన్ తదితర అంశాలపై సెషన్లు నిర్వహించారు. భారత వాణిజ్య, పరిశ్రమల సమాఖ్య ఫిక్కీ ఆధ్వర్యంలో టెక్నాలజీని అందిపుచ్చుకోవడం.. సమాజంలో సాధికారత సాధించడం అనే అంశంపై నిర్వహించిన సెషన్లో డిజిటల్ భారత్‌పై చర్చించారు. ఆర్టిఫిషియల్ ఇంటిలిజెన్స్, బ్లాక్‌చెయిన్, ఐవోటీ రంగాల అభివృద్ధికి సంబంధించి విశాఖలో ఉన్న అవకాశాలపై చర్చించారు. శుక్రవారం సాయంత్రంతో సదస్సు ముగియనుంది. రెండో రోజున స్టార్టప్‌ల అభివృద్ధి, చేయూత, టెక్నాలజీ, ఫార్మా తదితర రంగాల్లో రానున్న మార్పులపై సెషన్లు ఉంటాయని పల్సస్ సీఈవో శ్రీనుబాబు తెలిపారు.

ఎమ్మెల్సీ ఎన్నికలకు పక్కాగా ఏర్పాట్లు

మీడియా సెల్ ప్రారంభించిన కలెక్టర్



మీడియా సెల్‌ను ప్రారంభిస్తున్న కలెక్టర్ మల్లికార్జున, సీపీ శ్రీకాంత్

మహారాణిపేట: ఉత్తరాంధ్ర పట్టభద్రుల ఎన్నికల నేపథ్యంలో కలెక్టర్ కార్యాలయ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన మీడియా సెంటర్‌ను గురువారం కలెక్టర్ డాక్టర్ ఎ.మల్లికార్జున, నగర పోలీస్ కమిషనర్ సీహెచ్ శ్రీకాంత్ ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మీడియాతో మాట్లాడారు. ఈ నెల 23వ తేదీ వరకు ప్రతి రోజూ ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు నామినేషన్లు స్వీకరిస్తామని చెప్పారు. రిటర్నింగ్ అధికారి చాంబర్ నుంచి 100 మీటర్ల లోపు ఎటువంటి వాహనాలకు అనుమతి లేదని, అభ్యర్థితో పాటు నలుగురు వ్యక్తులు నామినేషన్ సమర్పించే సమయంలో ఉండవచ్చన్నారు. 24న నామినేషన్ల పరిశీలన, 27న ఉపసంహరణ, మార్చి 13న పోలింగ్ ఉంటుందన్నారు. 16న లెక్కింపు నిర్వహిస్తామని.. ఆరు జిల్లాలో పోలింగ్‌కు సంబంధించి స్టాఫ్ డేటాను సేకరిస్తున్నట్లు తెలిపారు. స్వర్ణభారతి స్టేడియంలో ఎన్నికల సామగ్రి పంపిణీ చేస్తామన్నారు. మొత్తం 331 పోలింగ్ స్టేషన్లు ఏర్పాటు చేశామని.. 2,87,258 మంది ఓటర్లుగా నమోదు చేసుకున్నారని వివరించారు. ప్రశాంతంగా ఎన్నికల నిర్వహణకు అందరూ సహకరించాలని కోరారు. సీపీ శ్రీకాంత్ మాట్లాడుతూ ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో నగరంలో ఆరు చోట్ల చెక్ పోస్టులు ఏర్పాటు చేశామన్నారు. జిల్లాలో 1200 మంది సిబ్బందిని వినియోగిస్తామన్నారు. ప్రవర్తన నియమావళి, ర్యాలీలు, సభల అనుమతి మంజూరు ఏసీపీ స్థాయి అధికారిని నియమించినట్లు చెప్పారు. డీఆర్వో శ్రీనివాసమూర్తి, సమాచార పౌర సంబంధాల శాఖ జేడీ వి.మణిరామ్, కలెక్టరేట్ ఏవో ఈశ్వరరావు పాల్గొన్నారు

తొలి రోజు స్వతంత్ర అభ్యర్థి నామినేషన్



కలెక్టర్‌కు నామినేషన్ పత్రాలు అందజేస్తున్న స్వతంత్ర అభ్యర్థి రమాప్రభ

ఉత్తరాంధ్ర పట్టభద్రుల ఎమ్మెల్సీ స్థానానికి పీడీఎఫ్ మద్దతుతో స్వతంత్ర అభ్యర్థిగా కోరెడ్ల రమాప్రభ నామినేషన్ దాఖలు చేశారు. విశాఖ జిల్లా కలెక్టర్ కార్యాలయంలో గురువారం తన నామినేషన్ పత్రాలను(రెండు సెట్లు) ఎన్నికల రిటర్నింగ్ అధికారి, కలెక్టర్ డా.ఎ.మల్లికార్జునకు అందజేశారు. అంతకుముందు ఆమె దాబాగార్డెన్స్‌లోని అంబేడ్కర్ విగ్రహం నుంచి కలెక్టర్ కార్యాలయం వరకు ర్యాలీగా తరలివచ్చారు. తొలుత ఆమె అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీలు ఐ.వెంకటేశ్వర్లు, లక్ష్మణరావు, మాజీ ఎమ్మెల్సీ ఎంవీఎస్ శర్మ, యూటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు బి.వెంకటేశ్వర్లు, ఉత్తరాంధ్ర అభివృద్ధి వేదిక ప్రధాన కార్యదర్శి ఎ.అజశర్మ తదితరులు పాల్గొన్నారు.

ఎస్‌ఐ పరీక్షకు 32 కేంద్రాలు

- కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలు
- నేటి ఏపీపీఎస్సీ పరీక్షకు ఏర్పాట్లు పూర్తి
- అధికారులతో సమీక్షలో డీఆర్వో శ్రీనివాసమూర్తి



మాట్లాడుతున్న డీఆర్వో శ్రీనివాసమూర్తి

విశాఖ విద్య: కేంద్ర, రాష్ట్ర స్థాయి పోటీ పరీక్షలను పకడ్బందీగా నిర్వహించాలని జిల్లా రెవెన్యూ అధికారి శ్రీనివాసమూర్తి అన్నారు. కలెక్టరేట్‌లో గురువారం వివిధ శాఖల అధికారులతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఏపీపీఎస్సీ, యూపీపీఎస్సీ, ఎస్ఐ పరీక్షలు ప్రశాంత వాతావరణంలో పూర్తయ్యేలా అంతా సమన్వయంతో పనిచేయాలన్నారు. శుక్రవారం ఏపీపీఎస్సీ ఆధ్వర్యంలో ఎండోమెంట్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ పరీక్ష షీలానగర్ ఐఆన్ డిజిటల్ సెంటర్‌లో జరుగుతుందన్నారు. 19న యూపీపీఎస్సీ నిర్వహించనున్న ఇంజనీరింగ్ సర్వీసెస్ ప్రిలిమినరీ పరీక్షకు నగరంలో 7 కేంద్రాలు ఏర్పాటు చేశామన్నారు. పరీక్షకు 2,225 మంది అభ్యర్థులు హాజరవుతున్నట్లు వెల్లడించారు. అదే రోజు రాష్ట్ర పోలీసు బోర్డు ఆధ్వర్యంలో నిర్వహించనున్న ఎస్ఐ పరీక్షకు జిల్లాలో మొత్తం 32 సెంటర్లు ఏర్పాటు చేశామన్నారు. 21,082 మంది అభ్యర్థులు పరీక్ష రాయనున్నారని తెలిపారు. పరీక్ష కేంద్రాల వద్దకు విద్యార్థులు సకాలంలో చేరుకునేలా ఆర్టీసీ బస్సులను ఏర్పాటు చేయాలని సంబంధిత శాఖ అధికారులను ఆదేశించారు. కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలు చేసి, తగిన పోలీసు బందోబస్తు ఏర్పాటు చేయాలని పోలీసు శాఖ అధికారులకు సూచించారు. పరీక్ష కేంద్రాల వద్ద తప్పనిసరిగా వైద్య సిబ్బంది అందుబాటులో ఉండాలన్నారు. పరీక్ష సమయంలో కేంద్రాల్లో ఎటువంటి విద్యుత్ అంతరాయం లేకుండా చూడాలని విద్యుత్ శాఖ అధికారులను ఆదేశించారు. సమావేశంలో విద్యుత్, ఆర్టీసీ, జీవీఎంసీ, పోలీసు, రెవెన్యూ, పోస్టల్, వైద్య ఆరోగ్యశాఖాధికారులు పాల్గొన్నారు.

ఉక్కు జనరల్ ఆస్పత్రి వైద్యులకు పతకాలు



పతకాలు సాధించిన వైద్యులతో ఉక్కు జనరల్ ఆస్పత్రి విభాగాధిపతి ప్రకాశ్

ఉక్కునగరం: జాతీయ స్థాయి ఉక్కు వైద్యుల సదస్సులో స్టీల్‌ప్లాంట్ జనరల్ ఆస్పత్రి వైద్యులు పలు పతకాలు సాధించారు. ఈ నెల 9 నుంచి 12 వరకు భిలాయ్‌లో అసిసోయేషన్ ఆఫ్ ఆలిండియా స్టీల్ మెడికల్ ఆఫీసర్స్(ఐస్మాక్) ఆధ్వర్యంలో 43వ సదస్సు నిర్వహించారు. ఈ సదస్సులో 8 స్టీల్‌ప్లాంట్లకు చెందిన 400 మంది వైద్యులు పాల్గొని వైద్య రంగంలో కొత్త పద్ధతులతో చేసిన పరిశోధనలను ప్రదర్శించారు. ఉక్కు జనరల్ ఆస్పత్రి వైద్యులు ఏడు సాంకేతిక పత్రాలు సమర్పించారు. డాక్టర్ దీప్తి సోయ్, డాక్టర్ శశిధర్‌లకు రజత పతకాలు, డాక్టర్ శాంతి ప్రియ, డాక్టర్ ఎస్.సౌజన్య కాంస్య పతకాలు గెలుపొందారు. ఆస్పత్రి వైద్యులు డాక్టర్ ఎ.పి.నవీన్‌కుమార్ లాండ్ కోవిడ్ సిండ్రోమ్ అంశంపై సెషన్ నడిపారు. డాక్టర్ మోహన్‌దాస్ వెరికోస్ వెయిన్స్ అన్న అంశంపై సింపోజియంలో కొత్త సర్జికల్ మేనేజ్‌మెంట్ గురించి వివరించారు. ఈ సందర్భంగా ప్రతిభ కనబరిచిన వైద్యులను ఉక్కు జనరల్ ఆస్పత్రి విభాగాధిపతి డాక్టర్ కె.హెచ్.ప్రకాశ్ అభినందించారు.

చదువుతో పాటు క్రీడలు

ఏయూ వీసీ ప్రసాదరెడ్డి



స్కేటర్ల జట్టుతో ఏయూ వీసీ ప్రసాదరెడ్డి

విశాఖ స్పోర్ట్స్: చదువుతో పాటు క్రీడలకు ప్రాధాన్యమివ్వాలని ఆంధ్ర విశ్వ విద్యాలయం ఆచార్య ప్రసాదరెడ్డి పిలుపునిచ్చారు. అంతర వర్సిటీల మెన్, వుమెన్ రోలర్ స్పోర్ట్స్‌ను శివాజీపార్క్‌లోని రింక్‌లో గురువారం వీసీ ప్రారంభించి మాట్లాడారు. మార్కులకే ప్రాధాన్యమిస్తున్న తరుణంలో కొందరు తల్లిదండ్రులు ఆటల్లో పిల్లలను ప్రోత్సహించడం అభినందనీయమన్నారు. ఏయూలో ఇటీవల క్రీడా మైదానాలను అభివృద్ధి చేశామన్నారు. పోటీల్లో పాల్గొనేందుకు వచ్చిన స్కేటర్లు విశాఖ అందాలను వీక్షించాలన్నారు. ఆర్టిస్టిక్ పోటీలకు శివాజీ పార్క్ వేదిక కానుండగా రోలర్ స్పోర్ట్స్, ఇన్‌లైన్ హాకీ, స్కేట్ బోర్డ్ పోటీలను వీఎంఆర్డీఏ పార్కులో, పార్కు దరి బీచ్‌రోడ్‌లో స్పీడ్ రేస్‌లు నిర్వహించనున్నారు. ఏయూ స్పోర్ట్స్ బోర్డ్ కార్యదర్శి విజయమోహన్, పీఈ విభాగ హెచ్‌వోడీ పల్లవి, స్కేటింగ్ సంఘం ప్రతినిధులు భగీరథ్, లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

డీఆర్ఎంతో జీవీఎంసీ కమిషనర్ భేటీ

పెండింగ్ అంశాలపై విస్తృత చర్చ



సమావేశంలో పాల్గొన్న డీఆర్ఎం అనూప్ కుమార్ సత్పతి, జీవీఎంసీ కమిషనర్ రాజాబాబు

తాటిచెట్లపాలెం: జీవీఎంసీ కమిషనర్ పి.రాజాబాబు నేతృత్వంలో ఉన్నత స్థాయి కమిటీ వాల్తేర్ డివిజన్ డివిజనల్ రైల్వే మేనేజర్ అనూప్‌కుమార్ సత్పతిని గురువారం ఆయన కార్యాలయంలో కలిశారు. ఈ సందర్భంగా ఎంతో కాలంగా జీవీఎంసీ వద్ద పెండింగ్‌లో ఉన్న పలు అంశాలపై డీఆర్ఎం చర్చించారు. అదేవిధంగా భూ బదలాయింపు, భూ సేకరణ, సుందరీకరణ, చెత్త తరలింపు, పెండింగ్‌లో ఉన్న బిల్లుల చెల్లింపులపై కూడా చర్చించారు. నగరంలో ప్రతిష్టాత్మకంగా నిర్వహించనున్న జీ - 20 సమావేశాలకు విదేశీ ప్రతినిధులు వస్తున్నందున నగర సుందరీకరణ విషయంలో పరస్పర సహకారంపై మాట్లాడారు. వాల్తేర్ డివిజన్‌కు చెందిన భూమిని పదేళ్ల కిందట బీఆర్‌టీఎస్ ప్రాజెక్టుకు ఇచ్చామని, బదులుగా అంతే విలువ గల భూమి రైల్వేకు జీవీఎంసీ ఇవ్వాల్సి ఉండగా పెండింగ్‌లో ఉందని, పరిష్కరించాలని రాజాబాబును డీఆర్ఎం కోరారు. పరిశీలించి సాధ్యమైనంత త్వరగా పరిష్కరించేందుకు ప్రయత్నిస్తానని రాజాబాబు తెలిపారు. అదేవిధంగా ప్రాజెక్టు క్లీన్ సిటీ – గ్రీన్ సిటీకి తమ మద్దతు ఉంటుందని డీఆర్ఎం అనూప్‌కుమార్ సత్పతి తెలిపారు.

మోసగించిన వ్యక్తికి రెండేళ్ల జైలు

విశాఖ లీగల్ : అరువు వస్తువుల పేరుతో మోసం చేసిన వ్యక్తికి రెండేళ్ల జైలు శిక్ష, రూ.2 వేల జరిమానా విధిస్తూ నగరంలోని ప్రధాన మెట్రోపాలిటిన్ మెజిస్ట్రేట్ జె.పద్మావతి గురువారం తీర్పు చెప్పారు. జరిమానా చెల్లించకుంటే అదనంగా నెల రోజుల సాధారణ జైలు శిక్ష అనుభవించాలని ఆ తీర్పులో పేర్కొన్నారు. అదనపు పబ్లిక్ ప్రాసిక్యూటర్ మైలపల్లి ఆదినారాయణ అందించిన వివరాలు ఇలా ఉన్నాయి. నిందితుడు జి.దినేష్ నగరంలోని పాత డైరీఫారం దగ్గర రవీంద్రనగర్ నివాసి. తన దగ్గర క్రెడిట్ కార్డులు ఉన్నాయని పలువురిని నమ్మించాడు. తక్కువ ధరకు గృహ వినియోగ వస్తువులు ఇస్తానని, నెలవారీ చెల్లించే ప్రీమియం కూడా చాలా తక్కువగా ఉంటుందని చెప్పేవాడు. ఈ నేపథ్యంలో ఆరిలోవకు చెందిన గోరిసెట్టి భాస్కరరావు మరో ఏడుగురి దగ్గర టీవీ, ఫ్రిడ్జ్, ఇతర గృహ ఉపకరణాలు ఇస్తానని చెప్పి వేలాది రూపాయలు వసూలు చేసి ముఖం చాటేశాడు. బాధితులు ఎన్నిసార్లు డబ్బులు అడిగినా ప్రయోజనం లేకపోవడంతో ఆరిలోవ పోలీసులను ఆశ్రయించారు. నేరం రుజువు కావడంలో న్యాయమూర్తి పైవిధంగా తీర్పునిచ్చారు.

మహిళల శిక్షణాలయం

- వృత్తి శిక్షణ.. ఉపాధి కల్పన
- వేలమందికి భరోసా కల్పిస్తున్న జిల్లా మహిళా ప్రాంగణం



తరగతిలో థియరీ నేర్చుకుంటున్న విద్యార్థినులు



జిల్లా మహిళా ప్రాంగణం

ఆరిలోవ(విశాఖ తూర్పు): మహిళలకు వృత్తి శిక్షణను అందించి, ఉపాధికి భరోసాను అందిస్తోంది జిల్లా మహిళా ప్రాంగణం. ఒకవిధంగా చెప్పాలంటే మహిళలకు శిక్షణను అందించే ఆలయం వంటిదే ఈ కేంద్రం. వేలమంది మహిళలు ఇక్కడ ఉచిత శిక్షణ పొంది, కుటుంబానికి చేదోడువాదోడుగా నిలుస్తున్నారు. కోవిడ్ ప్రభావంతో మూతపడిన ఈ ప్రాంగణం మళ్లీ ఇప్పుడిప్పుడే పూర్వ వైభవాన్ని సంతరించుకుంటోంది.

1986లో ప్రారంభమై..

విశాఖ కేంద్ర కారాగారం సమీపంలో పైనాపిల్ కాలనీ వద్ద 1986లో ఈ ప్రాంగణాన్ని ప్రారంభించారు. జీ ప్లస్ 1 తరహాలో నిర్మించిన ఈ భవనంలో విశాలమైన 8 గదులున్నాయి. ఒకేసారి 250 నుంచి 300 మంది వరకు వివిధ బ్యాచ్‌లలో శిక్షణ ఇచ్చే అవకాశం ఉంది. ఇక్కడ నగరంతో పాటు అరకు, పాడేరు, అనకాపల్లి, నర్సీపట్నం తదితర గ్రామీణ ప్రాంతాల నుంచి వచ్చిన వేలమంది మహిళలు చేతి వృత్తులు, కంప్యూటర్స్, నర్సింగ్ తదితర అంశాల్లో శిక్షణ పొందారు. 2019 వరకు నిరాటంకంగా శిక్షణలు కొనసాగాయి. అనంతరం, కోవిడ్ ప్రభావంతో సుమారు రెండేళ్ల పాటు ఈ ప్రాంగణం మూతపడటంతో శిక్షణకు అంతరాయం కలిగింది. రెండేళ్ల అనంతరం సాధారణ పరిస్థితులు నెలకొనడంతో 2022 మార్చి నుంచి శిక్షణ తరగతులు పునః ప్రారంభమయ్యాయి.

కరోనా తర్వాత 1516 మందికి శిక్షణ

- కోవిడ్ అనంతరం అంగన్‌వాడీ కార్యకర్తలకు, నర్సింగ్ సిబ్బందికి, ఆశ వర్కర్లకు వృత్యంతర శిక్షణలు నిర్వహించారు.
- స్వచ్ఛంద సంస్థల ఆధ్వర్యంలో జనరల్ డ్యూటీ అసిస్టెంట్(జీడీఏ) శిక్షణ ఇస్తున్నారు.
- 2022 మార్చి నుంచి 2023 ఫిబ్రవరి 14 వరకు వివిధ కోర్సుల్లో 1,516 మంది మహిళలకు శిక్షణ ఇచ్చారు. ఈ నెల 16 నుంచి మరో కొత్త బ్యాచ్ ప్రారంభం కానుంది.
- 2022 మార్చి నుంచి అక్టోబరు వరకు 1,317 మంది(అన్ స్కిల్డ్) అంగన్‌వాడీ, నర్సింగ్ సిబ్బందితో పాటు ఆశ వర్కర్లకు 10, 20, 30 రోజుల చొప్పున కాల వ్యవధితో శిక్షణలు ఇచ్చారు.
- 18 నుంచి 30 ఏళ్ల లోపు మహిళలకు 199 మందికి జీడీఏ శిక్షణ(స్కిల్డ్) శిక్షణ ఇచ్చారు. వారిలో రెడ్డీస్ ల్యాబ్ ఆధ్వర్యంలో మూడు నెలల కాల వ్యవధితో జనరల్ డ్యూటీ అసిస్టెంట్(జీడీఏ) కోర్సుల్లో బ్యాచ్‌ల వారిగా 2022 సెప్టెంబరు నుంచి ఇంతవరకు 124 మందికి శిక్షణ ఇచ్చారు. వారిలో 67 మంది శిక్షణ పూర్తి చేసుకున్నారు. వారందరికీ రెడ్డీస్ ల్యాబ్ నిర్వాహకులు పలు కార్పొరేట్ ఆస్పత్రుల్లో ఉద్యోగ అవకాశాలు కల్పించింది. ప్రస్తుతం మరో 57 మందికి శిక్షణ కొనసాగుతోంది. కొద్ది రోజుల్లో వీరి శిక్షణ ముగియనుంది.

ఏపీఎస్‌డీసీ ఆధ్వర్యంలో 16 నుంచి ..

ఈ నెల 16 నుంచి ఆంధ్రప్రదేశ్ స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో జీడీఏ కోర్సులో శిక్షణ ప్రారంభం కానుంది. దీని కోసం ఈ నెల 20 వరకు ఆసక్తి గల మహిళల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నారు. మూడు నెలల పాటు శిక్షణ ఉంటుంది. శిక్షణ అనంతరం ఉద్యోగ అవకాశం కల్పిస్తారు. మొదటి బ్యాచ్ 30 మందికి ఇవ్వనున్నారు. దూర ప్రాంతాల నుంచి వచ్చినవారికి ఉచితంగా బస్ పాస్‌లు కూడా మంజూరు చేయనున్నట్లు ప్రాంగణం అధికారులు తెలిపారు.

డాక్టర్ రెడ్డీస్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో..

యువతులకు డాక్టర్ రెడ్డీస్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నర్సింగ్ విభాగంలో శిక్షణ ఇస్తున్నారు. శిక్షణ అనంతరం ఉద్యోగావకాశాలు కల్పించనున్నారు. ఏడాది పాటు నాలుగు బ్యాచ్‌లు నిర్వహించడానికి రెడ్డీస్ ఫౌండేషన్ మహిళా ప్రాంగణంతో ఒప్పందం కుదుర్చుకుంది. ఇందులో భాగంగా గతేడాది సెప్టెంబరు 19న మొదటి బ్యాచ్ ప్రారంభించింది. ప్రతి బ్యాచ్‌కు మూడు నెలలు పాటు శిక్షణ ఇస్తుంది. మిగిలిన మూడు బ్యాచ్‌లు ఒకదాని తర్వాత మరొకటి కొనసాగుతాయి.

మహిళలకు ఎంతో ఉపయోగం



ప్రాంగణంలో అందిస్తున్న శిక్షణలు మహిళలకు ఎంతో ఉపయోగం. ప్రస్తుతం మూడు నెలల కోర్సుతో జీడీఏ శిక్షణ జరుగుతోంది. రెడ్డీస్ ల్యాబ్ ఆధ్వర్యంలో 199 మందికి శిక్షణ ఇచ్చారు. వారిలో ఇప్పటికే 67 మందికి శిక్షణ పూర్తయి, కార్పొరేట్ ఆస్పత్రులలో ఉద్యోగాలు వచ్చాయి. ఈ నెల 16న ఏపీఎస్‌డీసీ ఆధ్వర్యంలో జీడీఏ కోర్సుకు శిక్షణ ప్రారంభిస్తాం. ఈ శిక్షణలో థియరీతో పాటు ప్రాక్టికల్స్ ఉంటాయి. ఆస్పత్రిలో రోగులకు ఏ విధంగా సేవలు అందించాలనే అంశాలపై శిక్షణ ఇస్తారు. బీపీ, టెంపరేచర్ చెక్ చేయడం, రక్త పరీక్షల కోసం శాంపిల్ సేకరించడం, కార్డియో పల్మనరీ రెసిటేషన్ (సీపీఆర్) చేయడం, ఐసీయూలో బెడ్‌పై ఉన్న పేషెంట్‌కు చేయాల్సిన పరీక్షలతో పాటు అత్యవసర సమయాల్లో ఎలాంటి సేవలు అందించాలి, ఐసీయూలో ఉన్న రోగులకు ఏ విధంగా అందుబాటులో ఉండాలి, వారిపట్ల ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలి తదితర అంశాలపై శిక్షణ ఇస్తారు.

– పి.విమలకుమారి, మహిళా ప్రాంగణం జిల్లా మేనేజర్

22న నామినేషన్ వేస్తా..

బీజేపీ ఎమ్మెల్సీ అభ్యర్థి మాధవ్

ఎంవీపీకాలనీ: ఉత్తరాంధ్ర పట్టభద్రుల నియోజకవర్గ ఎమ్మెల్సీ బీజేపీ అభ్యర్థిగా ఈ నెల 22న నామినేషన్ వేస్తున్నట్లు ఆ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పీవీఎన్ మాధవ్ తెలిపారు. లాసన్స్ బే కాలనీలోని పార్టీ కార్యాలయంలో గురువారం ఆయన విలేకరులతో మాట్లాడారు. మరోసారి ఎమ్మెల్సీ అభ్యర్థిగా బీజేపీ రాష్ట్ర, కేంద్ర నాయకులు తనకు అవకాశం కల్పించడం పట్ల ఆనందం వ్యక్తం చేశారు. ఈ నెల 22న పార్టీ శ్రేణులతో కలిసి నామినేషన్ వేయనున్నట్లు వెల్లడించిన ఆయన.. జనసేన మద్దతులోనే ఈ ఎన్నికల్లో పోటీ చేస్తున్నట్లు స్పష్టం చేశారు. పోలింగ్ బూత్‌ల ఏర్పాటు అస్తవ్యస్తంగా ఉందని.. ఎన్నికల యంత్రాంగం వైఎస్సార్ సీపీకి కొమ్ముకాస్తోందని ఆరోపించారు. భూమి విషయంలో పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు సోము వీర్రాజుపై ఆరోపణలను ఖండించారు. బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు విజయానందరెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి దామోదర్ పాల్గొన్నారు.

హయ్యర్ పెన్షన్‌పై స్టీల్‌ప్లాంట్ ఉద్యోగుల్లో టెన్షన్

- ఆప్షన్‌పై ఉద్యోగుల్లో భిన్నాభిప్రాయాలు
- స్టీల్‌ప్లాంట్‌లో ఎక్కడ చూసినా ఇదే చర్చ

ఉక్కునగరం: హయ్యర్ పెన్షన్‌పై స్టీల్‌ప్లాంట్ ఉద్యోగుల్లో ఆందోళన నెలకొంది. హయ్యర్ పెన్షన్‌కు ఆప్షన్ ఇవ్వాలా? వద్దా? అనే అంశంపై సందిగ్ధతతో ఉన్నారు. హయ్యర్ పెన్షన్‌పై సుప్రీంకోర్టు ఉత్తర్వుల మేరకు 2014 సెప్టెంబర్ ముందు ఆప్షన్ ఇచ్చి పదవీ విరమణ చేసిన ఉద్యోగులు దరఖాస్తు చేసుకోవాలని ఈపీఎఫ్ఓ మొదట సర్క్యులర్ విడుదల చేసింది. ఇక 2014 తర్వాత పదవీ విరమణ చేసిన ఉద్యోగులు, ప్రస్తుతం సర్వీసులో ఉన్న ఉద్యోగుల అంశంపై ఈపీఎఫ్ఓ సర్క్యులర్ కోసం దేశవ్యాప్తంగా ఉద్యోగులు, ఆయా సంస్థల యాజమాన్యాలు ఎదురు చూస్తున్నాయి. సుప్రీంకోర్టు ఇచ్చిన గడువు మార్చి 4వ తేదీ సమీపిస్తుండటంతో ముందస్తు తయారీలో భాగంగా అన్ని సంస్థలు తమ ఉద్యోగుల నుంచి అనుమతి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నాయి. అదే విధంగా స్టీల్‌ప్లాంట్ యాజమాన్యం కూడా ఈనెల 22లోగా దరఖాస్తు చేసుకోవాలని నిర్దేశించింది. దీంతో ఉద్యోగుల్లో టెన్షన్ ప్రారంభమైంది. ఇప్పుడు అసలు హయ్యర్ పెన్షన్ లాభమా.. నష్టమా అనే అంశంపై చర్చ ప్రారంభమైంది. రిటర్న్ ఆఫ్ క్యాపిటల్ లేదు కనుక మూలధనంగా ఇచ్చిన లక్షలాది రూపాయలు నష్టపోతాం.. ప్రస్తుతం ఇస్తున్న ఈపీఎస్–95 పెన్షన్ ఫార్ములా ప్రకారం రావటం లేదు.. అదే పరిస్థితి హయ్యర్ పెన్షన్‌కు చేస్తే ఇంకా ఎక్కువ నష్టపోతాం.. దాని కంటే ప్రస్తుత పెన్షన్‌ను తీసుకుంటూ రిటైర్‌మెంట్ తర్వాత పీఎఫ్ మొత్తం తీసుకుని దానిని ఇన్వెస్ట్‌మెంట్ చేసుకుంటే మంచిదేమో అన్న అభిప్రాయాలు కొంత మందికి ఉన్నాయి. పెన్షన్ కోసం 2019 నుంచి చాలా మంది పదవీ విరమణ చేసిన ఉద్యోగులు, కొన్ని జాతీయ ఉద్యోగ సంఘాలు కోట్లాది రూపాయలు ఖర్చు పెట్టి సుప్రీంకోర్టులో పోరాడితే వచ్చిన హయ్యర్ పెన్షన్ ఉద్యోగులకు నష్టం ఎందుకవుతుందని, హయ్యర్ పెన్షన్ ఉద్యోగికి లాభం కనుకనే ఈపీఎఫ్ఓ సర్క్యులర్ ఇవ్వటంలో జాప్యం చేస్తుందన్నది మరి కొందరి వాదనగా ఉంది. వచ్చిన సొమ్మును సద్వినియోగం చేసుకోకపోతే, పిల్లలపై ఆధారపడాల్సి వస్తుందని.. దానికి బదులుగా పెన్షన్ ఉంటే మనోధైర్యంగా, స్వతంత్రంగా బతకవచ్చని అభిప్రాయపడుతున్నారు. రిటైర్‌మెంట్ తర్వాత ఐదేళ్లు బతికి, ఆ తర్వాత డిపెండెంట్ మరో ఐదేళ్లు బతికినా మూలధనం కంటే ఎక్కువ లభిస్తుందన్నది వారి భావనగా ఉంది. ఈ విషయంలో స్టీల్‌ప్లాంట్ ఉన్నతాధికారుల నుంచి సామాన్య కార్మికుని వరకు, కార్మిక సంఘాల నాయకులకు పూర్తి అవగాహన లేకపోవడంతో ఉద్యోగుల పరిస్థితి గందరగోళంగా ఉంది. హయ్యర్ పెన్షన్‌కు మూల ధనం ఎంత కట్టాలి, ఎంత పెన్షన్ వస్తుంది, పెన్షన్ ఫార్ములాపై ఈపీఎఫ్ఓ నుంచి నిబంధనలు వచ్చే వరకు ఈ గందరగోళం ఇలాగే కొనసాగే అవకాశం ఉంది.

చివరి వరకు అవకాశం కల్పించాలి

ప్రస్తుత పెన్షన్ ఫార్ములా ప్రకారం హయ్యర్ పెన్షన్ అమలు చేస్తే ఉద్యోగి అంత ఎక్కువ మూలధనం చెల్లించాల్సిన అవసరం ఉండక పోవచ్చు. 1995 నుంచి ఇప్పటి వరకు పూర్తి వేతనంపై మూలధనం తీసుకుంటే చివరి 60 నెలల జీతం సరాసరి పెన్షన్‌గా చెల్లించే అవకాశం ఉందని భావిస్తున్నాం. హయ్యర్ పెన్షన్ కోసం ఈపీఎఫ్ఓ కొత్త సర్క్యులర్ వచ్చే వరకు స్పష్టత లేదు. చివరి వరకు ఉద్యోగులకు ఆప్షన్ ఇచ్చే అవకాశం కల్పించాలి.

– కాటం ఎస్.ఎస్.చంద్రరావు, అధ్యక్షుడు, ఉక్కు అధికారుల సంఘం

ఆయిల్ లారీ ఢీకొని వృద్ధుడు దుర్మరణం


ఘటన స్థలం వద్ద సూర్యనారాయణ మృతదేహాన్ని పరిశీలిస్తున్న సీఐ లూథర్‌బాబు

మల్కాపురం(విశాఖ పశ్చిమ): రోడ్డు పక్కన బస్సు కోసం నిరీక్షిస్తున్న ఓ వృద్ధుడిని ఆయిల్ లారీ రివర్స్‌లో వచ్చి బలంగా ఢీకొట్టడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. ఈ ఘటనకు సంబంధించి మల్కాపురం పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. గాజువాక ప్రాంతానికి చెందిన పొన్నగంటి సూర్యనారాయణ(60) వస్త్రాలు విక్రయిస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. ఆయన గురువారం మధ్యాహ్నం 12.30 గంటల సమయంలో నగరానికి వెళ్లేందుకు మారుతీ సర్కిల్ సమీప ట్రాఫిక్ పాయింట్ వద్ద ఆర్టీసీ బస్సు కోసం నిరీక్షిస్తున్నాడు. ఆ సమయంలో షీలానగర్ మార్గంలో ఈస్ట్ ఇండియా ఆయిల్ కంపెనీ వైపు బందులాల్‌యాదవ్ అనే డ్రైవర్ ఆయిల్ లారీతో వేగంగా వచ్చాడు. లారీ ఇక్కడి గొడౌన్స్ మార్గం వైపు వెళ్లాల్సి ఉంది. కానీ ఐఎస్ఎస్ డేగా వైపు ఎడమ వైపు మలుపు తిప్పి, లారీని రివర్స్ చేస్తూ వేగంగా నడిపించుకుంటూ వచ్చారు. లారీని రివర్స్ డ్రైవింగ్ చేసేటప్పుడు క్లీనర్ కిందకు దిగి వెనక ఎవరైనా ఉన్నారేమోనని పరిశీలించి డ్రైవర్‌కు సూచనలు చేయాల్సి ఉంది. కానీ క్లీనర్ ఆ పని చేయలేదు. డ్రైవర్ కూడా పట్టించుకోకుండా రివర్స్ చేయడంతో అక్కడ బస్సు కోసం ఉన్న సూర్యనారాయణ పైనుంచి లారీ వెనక టైర్ వెళ్లిపోయింది. అంతే కాక ఆ వృద్ధుడిని కొంత దూరం వరకు లారీ ఈడ్చుకుపోయింది. ఈ ఘటనలో ఆయన అక్కడికక్కడే దుర్మరణం చెందాడు. సమాచారం అందుకున్న మల్కాపురం సీఐ లూథర్‌బాబు ఘటన స్థలానికి చేరుకుని ప్రమాదంపై ఆరా తీశారు. నిర్లక్ష్యంగా వ్యవహరించిన లారీ డ్రైవర్, క్లీనర్‌ను అదుపులోకి తీసుకున్నారు. అనంతరం మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కేజీహెచ్‌కు తరలించారు. మృతుడు కుటుంబ సభ్యులకు సమాచారం అందజేశారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పాలిటెక్నిక్‌తో భవితకు భరోసా..!

- పాలీసెట్ దరఖాస్తుల ప్రక్రియ ప్రారంభం
- ఉమ్మడి విశాఖ జిల్లాలో 26 కాలేజీలు
- అందుబాటులో 8,592 సీట్లు
- విద్యార్థుల సౌకర్యార్థం 7 హెల్ప్‌లైన్ కేంద్రాలు


శిక్షణ పొందుతున్న పాలిటెక్నిక్ విద్యార్థులు

విశాఖ విద్య: పాలిటెక్నిక్ కోర్సు చదవాలనుకునే విద్యార్థులకు సమయం ఆసన్నమైంది. పాలిటెక్నిక్ ప్రవేశాల కోసమని సాంకేతిక విద్యాశాఖ నోటిఫికేషన్ జారీ చేసింది. 'పాలిసెట్ – 2023'కు గురువారం నుంచి దరఖాస్తుల ప్రక్రియ ప్రారంభమైంది. ఉమ్మడి విశాఖపట్నం జిల్లాలో ప్రభుత్వ, ప్రైవేటు యాజమాన్యాల పరిధిలో 26 కాలేజీలు ఉండగా, మొదటి ఏడాదిలో ప్రవేశం కోసం 12 బ్రాంచిల్లో 8,592 సీట్లు అందుబాటులో ఉన్నాయి. పాలిటెక్నిక్ పాసైతే ప్రభుత్వ, ప్రైవేటు సెక్టార్లలో కొలువు గ్యారెంటీ కావడంతో దీనిపై విద్యార్థుల్లో మంచి క్రేజ్ ఉంది. ఇంజినీరింగ్ రెండో సంవత్సరంలో నేరుగా చేరవచ్చు. ఈ నేపథ్యంలో ఈసారి ఎక్కువ మంది విద్యార్థులు పాలిటెక్నిక్ కోర్సుల వైపు వచ్చేలా సాంకేతిక విద్యాశాఖ అధికారులు దృష్టి సారించారు.

ఇదీ షెడ్యూల్...

పదో తరగతి ఉత్తీర్ణులైన వారు పాలీసెట్ ఎంట్రన్స్ పరీక్ష రాసేందుకు అర్హులు. ఏప్రిల్ 30 వరకు దరఖాస్తు చేసుకునేందుకు గడువు ఉంది. మే 10న ఎంట్రన్స్ పరీక్ష నిర్వహిస్తారు. మే 25న ఫలితాలు వెల్లడిస్తామని సాంకేతిక విద్యాశాఖ షెడ్యూల్ జారీ చేసింది. ఎంట్రన్స్ పరీక్ష రాసేందుకు ఓసీ, బీసీ వర్గాల విద్యార్థులు రూ.400లు, ఎస్సీ, ఎస్టీ వర్గాల వారైతే రూ.100లు ఫీజు చెల్లించి, తగిన ధ్రువీకరణ పత్రాలతో http://polycetap.nic.in అనే వెబ్ సైట్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి. ప్రవేశ పరీక్షకు హాజరయ్యే విద్యార్థుల సౌకర్యార్థం ఉమ్మడి విశాఖపట్నం జిల్లాలో ఉన్న 7 ప్రభుత్వ పాలిటెక్నిక్ కాలేజీల్లో హెల్ప్‌లైన్ సెంటర్లు ఏర్పాటు చేశారు.

ఉమ్మడి విశాఖలో ఇదీ పరిస్థితి

ఉమ్మడి విశాఖ జిల్లాలో ప్రభుత్వ ఆధ్వర్యంలో విశాఖపట్నం నగరంలో కంచరపాలెం, ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ కెమికల్ ఇంజినీరింగ్, భీమునిపట్నం(బాలికలు), అనకాపల్లి జిల్లాలో అనకాపల్లి, నర్సీపట్నం, అల్లూరి సీతారామరాజు జిల్లాలో పాడేరు, ఎటపాక కాలేజీలు నిర్వహిస్తున్నారు. వీటిలో 1,779 సీట్లు అందుబాటులో ఉన్నాయి. అదేవిధంగా మూడు జిల్లాల పరిధిలో 19 ప్రైవేటు కాలేజీలు ఉండగా, వాటిలో 6,813 సీట్లు ఉన్నాయి. ప్రభుత్వ కాలేజీల్లో కోర్సులకు ఏడాదికి ఫీజు రూ.4,700లు కాగా, ప్రైవేటు కాలేజీల్లో సీటు లభించినట్లైతే రూ.25 వేలు చెల్లించాలి.

పాలిటెక్నిక్‌తో ఉజ్వల భవిష్యత్

విశాఖపట్నం, అనకాపల్లి జిల్లాల పరిధిలో ఉన్న పరిశ్రమల్లో కోర్ బ్రాంచిలైన సివిల్, మెకానికల్, ఎలక్ట్రికల్ కోర్సులు చేస్తున్న వారికి ఉద్యోగాలు బాగానే దక్కుతున్నాయి. వచ్చే నెలలో జరిగే జీ – 20 సదస్సుతో విశాఖ పరిసర ప్రాంతాల్లో భారీగా పరిశ్రమలు ఏర్పాటయ్యే అవకాశం ఉండడంతో కోర్ బ్రాంచిలు చేసే విద్యార్థులకు ఉపాధి అవకాశాలు చేరువలోకి రానున్నాయి. ఈ నేపథ్యంలో ఉమ్మడి విశాఖ జిల్లాలో ఉన్న ప్రభుత్వ కాలేజీలకు మంచి డిమాండ్ ఉంటుందని భావిస్తున్నారు. దీంతో ప్రభుత్వ పాలిటెక్నిక్ కాలేజీల వారీగా ఉన్న సీట్లు, ఫ్యాకల్టీ, వసతి వంటి అంశాలపై విస్తృత ప్రచారం చేసి, సీట్లన్నీ భర్తీ అయ్యేలా విస్తృత ప్రచారం చేపట్టేలా సాంకేతిక విద్యాశాఖ కమిషనర్ దిశానిర్దేశం చేశారు.

హెల్ప్‌లైన్ సెంటర్లు ఏర్పాటు



పాలీసెట్‌కు దరఖాస్తు చేసుకునేందుకు ప్రభుత్వ కాలేజీల్లో హెల్ప్‌లైన్ సెంటర్లు ఏర్పాటు చేశాం. ఇప్పటికే కాలేజీల ప్రిన్సిపాళ్లతో సమావేశం నిర్వహించాం. విస్తృత ప్రచారం చేపట్టేలా కార్యాచరణ సిద్ధం చేశాం. పాలిటెక్నిక్ కోర్సులు చేసిన వారికి మంచి అవకాశాలు ఉన్నాయి. ఆసక్తి ఉన్న విద్యార్థులు హెల్ప్‌లైన్ కేంద్రాల్లో సంప్రదించాలి.

– జీవీవీ సత్యనారాయణమూర్తి, పాలీసెట్ కన్వీనర్, ఉమ్మడి విశాఖ జిల్లా

బ్లాక్ మెయిల్, బెదిరింపులే పీతల మూర్తి వ్యక్తిత్వం

- నిత్యం ధర్నాలు, ప్రెస్‌మీట్లు, నిరసనలతోనే కాలయాపన
- విశాఖ పరిపాలన రాజధానిపై మీ స్టాండ్ ఏంటి?
- జనసేన కార్పొరేటర్‌పై మండిపడ్డ పలువురు కార్పొరేటర్లు


సమావేశంలో మాట్లాడుతున్న కార్పొరేటర్లు

దాబాగార్డెన్స్(విశాఖ దక్షిణ): వార్డు ప్రజలు నమ్మి ఓట్లేసి గెలిపిస్తే..వారికి ఏమీ చేయలేని నాయకుడిగా.. చేతకాని కార్పొరేటర్‌గా పీతల మూర్తి యాదవ్ నిలిచిపోయారని పలువురు కార్పొరేటర్లు ధ్వజమెత్తారు. గురువారం వీజేఎఫ్ ప్రెస్‌క్లబ్‌లో పలు వార్డుల కార్పొరేటర్లు రెయ్యి వెంకటరమణ, చెన్నా జానకీరామ్, శశికళ, కె.కామేశ్వరి మీడియా సమావేశంలో మాట్లాడారు. జీవీఎంసీ పరిధిలో అన్ని వార్డుల్లో అభివృద్ధి పనులు జరుగుతుంటే.. మూర్తి వార్డులో అభివృద్ధి పనులు జరగడం లేదని చెప్పుకోవడం సిగ్గుచేటన్నారు. మేయర్, కమిషనర్‌పై లేనిపోని ఆరోపణలు చేస్తూ, అధికారుల్ని బ్లాక్ మెయిల్, కాంట్రాక్టర్లను బెదిరించడానికే సమయమంతా వెచ్చిస్తున్నారే తప్ప.. వార్డు అభివృద్ధిపై కన్నెత్తి చూడకపోవడం ఆ వార్డు ప్రజలు చేసుకున్న పాపమన్నారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రతిష్టాత్మకంగా విశాఖను విశ్వనగరంగా చేయడమే లక్ష్యంగా పని చేస్తున్నారన్నారు. జీ–20 సదస్సును ఘనంగా నిర్వహించేందుకు కృషి చేస్తుంటే.. అది చూసి ఓర్వలేక టీడీపీ, జనసేన కార్పొరేటర్లు ఆరోపణలు చేయడం దారుణమన్నారు. జీ–20 సదస్సుకు సంబంధించి చేపట్టనున్న అభివృద్ధి, సుందరీకరణ పనుల కోసం జీవీఎంసీ కౌన్సిల్ సమావేశంలో సభ్యులు ఆమోదం తెలిపితే.. పీతల మూర్తి ఏదో అవినీతి జరిగిపోయిందంటూ నిత్యం ప్రెస్‌మీట్లు పెట్టి ఆరోపణలు చేయడం సిగ్గుచేటన్నారు. అసలు పరిపాలన రాజధానిగా విశాఖపట్నంపై జనసేన పార్టీ వ్యక్తిగా.. మీ స్టాండ్ ఏంటని వారు ప్రశ్నించారు. నిత్యం ధర్నాలు, ప్రెస్‌మీట్లు పెట్టి కాలయాపన చేయడం సిగ్గు అనిపించ లేదా? అంటూ దుయ్యబట్టారు. ఉత్తరాంధ్ర జిల్లాల ప్రజలపై అభిమానం ఉంటే.. విశాఖపట్నం పరిపాలన రాజధానికి మద్దతు తెలపాలని హితవు పలికారు. రూ.లక్షా 80 వేల కోట్ల పైబడి పెట్టుబడులు వస్తుంటే.. అవి కనిపించకపోవడం దారుణమన్నారు. ముఖ్యంగా మూర్తి ఎవరితోనూ సఖ్యతగా లేకుండా పనులు చేయించుకోలేకపోవడం తన అసమర్థత అన్నారు. రాష్ట్రంలో పార్టీలు, కులాలు, మతాలకు అతీతంగా ప్రభుత్వ సంక్షేమ ఫలాలు అందుతున్నాయని చెప్పారు. ఈ సమావేశంలో పార్టీ నాయకులు దమయంతి, రాణి, శ్యామ్, వినోద్ పాల్గొన్నారు.




అబ్బురపరిచిన విన్యాసాలు



బీచ్‌రోడ్డు: సిరిపురంలోని గురజాడ కళాక్షేత్రంలో గురువారం ప్రారంభమైన రాంబో సర్కస్ ఒళ్లు గగుర్పాటుకు గురి చేసింది. యువ కళాకారుల ప్రదర్శనలు ఆహూతులను అలరించాయి. థ్రిల్ కలిగించే స్టంట్స్‌తో పాటు జోకర్ల కామెడీ ప్రదర్శనలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. 42 మంది కళాకారులు 18 ప్రదర్శనలు చేసి ప్రేక్షకులను ఉత్తేజపరిచారు. ఐదేళ్ల తర్వాత నగరంలో సర్కస్ ఏర్పాటు చేయడంతో.. కళాకారుల విన్యాసాలు తిలకించేందుకు నగర ప్రజలు ఆసక్తి కనబరిచారు. ఈ సర్కస్ ఆదివారం వరకు సాగనుంది.

అప్పన్నను దర్శించుకున్న తెలంగాణ వ్యవసాయశాఖ మంత్రి


కప్పస్తంభానికి మొక్కుకుంటున్న తెలంగాణ వ్యవసాయశాఖ మంత్రి నిరంజన్‌రెడ్డి

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీ నృసింహస్వామిని గురువారం తెలంగాణ వ్యవసాయశాఖ మంత్రి నిరంజన్‌రెడ్డి దర్శించుకున్నారు. ఆలయంలోని కప్పస్తంభాన్ని ఆలింగనం చేసుకున్నారు. ఆయన పేరిట అర్చకులు స్వామికి పూజలు నిర్వహించారు. వేద ఆశీర్వచనం అందజేశారు. ఆలయ సంప్రదాయం ప్రకారం స్వామివారి ప్రసాదాన్ని ఉప ప్రధానార్చకుడు కె.కె.ప్రసాదాచార్యులు అందజేశారు.

స్కిల్ డెవెలప్‌మెంట్ ఇన్‌స్టిట్యూట్‌కు గ్లోబల్ అవార్డు

ఆరిలోవ (విశాఖ తూర్పు): ముడసర్లోవ వద్ద హెచ్‌పీసీఎల్ నిర్వహిస్తున్న స్కిల్ డెవలప్‌మెంట్ ఇన్‌స్టిట్యూట్‌కు వరుసగా మూడోసారి గ్లోబల్ హెచ్‌ఆర్ స్కిల్ డెవలప్‌మెంట్ అవార్డు లభించింది. ఢిల్లీలో గురువారం జరిగిన 13వ ప్రపంచ పెట్రోకోల్ కాంగ్రెస్ కార్యక్రమంలో ఈ అవార్డును స్కిల్ డెవలప్‌మెంట్ ఇన్‌స్టిట్యూట్ జనరల్ మేనేజర్ నగేష్‌కు ప్రపంచ పెట్రోకోల్ నిర్వాహకులు అందజేశారు. వరుసగా మూడుసార్లు అవార్డు రావడంపై ఇన్‌స్టిట్యూట్ నిర్వాహకులు ఆనందం వ్యక్తం చేశారు.

నేడు కూడా వందేభారత్ రీషెడ్యూల్

తాటిచెట్లపాలెం(విశాఖ ఉత్తర): విశాఖపట్నం–సికింద్రాబాద్ (20833) వందేభారత్ ఎక్స్‌ప్రెస్ శుక్రవారం రెండు గంటలు ఆలస్యంగా బయల్దేరింది. ఇటీవల సికింద్రాబాద్ సమీపంలో గోదావరి ఎక్స్‌ప్రెస్ పట్టాల తప్పిన కారణంగా వందేభారత్ రైలు ఆలస్యంగా నడుస్తుంది. గురువారం కూడా ఈ రైలు విశాఖ నుంచి మూడు గంటలు ఆలస్యంగా ఉదయం 8.45 గంటలకు బయల్దేరింది. ఈ కారణంగా అటునుంచి కూడా ఆలస్యంగా బయల్దేరింది. మధ్యాహ్నం 2.45 గంటలకు సికింద్రాబాద్‌లో బయల్దేరాల్సిన రైలు సుమారు 6.15 గంటలకు బయల్దేరింది. విశాఖకు రాత్రి 11 గంటలకు రావలసిన ఉండగా శుక్రవారం తెల్లవారు 2 గంటలకు చేరుకుంది. ఈ కారణంగా వందేభారత్‌ను శుక్రవారం కూడా రెండు గంటలు రీషెడ్యూల్ చేసినట్లు అధికారులు తెలిపారు. ఉదయం 5.45 గంటలకు బయల్దేరవలసిన ఈ రైలు విశాఖలో 7.45 గంటలకు బయల్దేరుతుంది.

విశాఖ బులియన్

24 క్యారెట్స్(10 గ్రా.)	రూ.56,730
22 క్యారెట్స్(10 గ్రా.)	రూ.52,000
వెండి(కిలో):	రూ.71,800

చికెన్ ధరలు



చికెన్ (కిలో) (వెన్‌కాబ్)

బ్రాయిలర్ (లైవ్)	: రూ.90
స్కిన్	: రూ.150
స్కిన్‌లెస్	: రూ.160

కోడిగుడ్ల ధరలు

రూ.లలో (వందకు)

విశాఖ	420.00
విజయనగరం	424.00
శ్రీకాకుళం	424.00